పీఎస్‌లను సందర్శించిన ట్రైనీ ఐపీఎస్‌లు

గచ్చిబౌలి: ఫీల్డ్ విజిట్‌లో భాగంగా ట్రైనీ ఐపీఎస్‌లు పోలీస్ స్టేషన్లను శనివారం సందర్శించారు. గచ్చిబౌలి, రాయదుర్గం పీఎస్‌లో నలుగురు చొప్పున ట్రైనీ ఐపీఎస్‌లకు రిసెప్షన్, రికార్డులు, లాకప్, సీసీ కెమెరాల పరిశీలన ఎలా ఉంటుందో ఎస్‌హెచ్‌ఓలు వారికి వివరించారు. డయల్ 100 తో పాటు పీఎస్‌లకు ఫోన్లలో ఎలా ఫిర్యాదు చేస్తారు, పెట్రోల్ మొబైల్ సిబ్బంది ఎలా స్పందిస్తారు, ఎఫ్ఐఆర్‌ల నమోదు, హోంగార్డు, కానిస్టేబుల్ నుంచి ఎస్‌హెచ్‌ఓ వరకు వారు నిర్వహించే విధులను క్షుణ్ణంగా వివరించారు.

వివాహిత ఆత్మహత్య

గచ్చిబౌలి: యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. శ్రీకాకుళం జిల్లా జలమూరు మండలం సావిరిగం గ్రామానికి చెందిన అప్పలనాయుడు, అంకోలు రమా (21) దంపతులు. వీరు బతుకుదెరువు కోసం రాయదుర్గానికి వలస వచ్చారు. మల్కం చెరువు ఎదుట గుడిసెలో నివాసం ఉంటూ నర్సరీలో పని చేస్తున్నారు. శుక్రవారం రమా కడుపునొప్పిగా ఉందని తల్లి మంజులకు చెప్పి ఇంటి వద్దే ఉంది. తల్లి, భర్త మధ్యాహ్నం వచ్చి చూడగా నోట్ల నుంచి నురగలు కక్కుతూ అపస్మారక స్థితిలో పడి ఉన్నది. వెంటనే ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందింది. కడుపు నొప్పి కారణంగా పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిందని పోలీసులు తెలిపారు. ఉస్మానియా ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

గృహిణి ..

గచ్చిబౌలి: గృహిణి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ జగదీష్ తెలిపిన వివరాల ప్రకారం .. పంచవటి కాలనీలో కాంతా (24) భర్త అరుణ్ చౌదరితో కలిసి ఉంటోంది. గురువారం కృష్ణానగర్‌లో తల్లిగారి ఇంటివద్ద పూజకు వెళ్లి వచ్చింది. రాత్రి 11 గంటల సమయంలో పురుగుల మందు తాగడాన్ని కుటుంబ సభ్యులు గమనించారు. వెంటనే అపోలో ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఉస్మానియాకు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు మృతి చెందింది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు మైసమ్మ బోనాలు

మూసాపేట: ఫతేనగర్ డివిజన్ హెచ్‌పీ రోడ్డులోని మైసమ్మ తల్లికి ఆషాఢ మాసం బోనాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తూము జగదీష్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, భక్తుల బోనాల సమర్పణ, సాయంత్రం ఫలహారబండి ఊరేగింపు వంటి పూజా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్య అతిథిగా పాల్గొననున్నట్లు తెలిపారు.

ఆర్థికసాయం

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మ బండ పరిధిలోని గురుగోవింద్ సింగ్ నగర్ కాలనీలో నివసించే చేరుసింగ్ అనారోగ్యంతో మృతి చెందాడు. శనివారం విషయం తెలుసుకున్న యువ నాయకుడు రామకృష్ణగౌడ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి డీవీజీ ట్రస్టు ద్వారా ఆర్థిక సహాయం అందజేశారు.


విరిగిన కుర్చీ


విరిగిన పిల్లల ఆట వస్తువులు


శిథిలావస్థలో కమ్యూనిటీ షెడ్

ఆహ్లాదమా..అదెక్కడ..?

- నిర్వహణ లేని న్యూ ప్రశాంత్‌నగర్ ఉద్యానవనం
- చెత్తాచెదారంతో అధ్వానంగా మారిన వైనం
- మరోవైపు రిపేర్‌కు నోచుకోని బోరు
- విరిగిన పిల్లల ఆట వస్తువులు, బెంచీలు


పిచ్చిమొక్కలతో అధ్వానంగా న్యూ ప్రశాంత్‌నగర్ కాలనీ పార్కు

మియాపూర్: ఉరుకులు, పరుగుల జీవితంలో కాసింతా సేద తీరేందుకు, పిల్లలు ఆడుకునేందుకు పార్కులు ఎంతో దోహదపడుతాయి. కానీ కొన్ని పార్కుల్లో నిర్వహణ సరిగా లేక అధ్వానంగా మారాయి. ఏటా పార్కుల నిర్వహణ, అభివృద్ధికి లక్షల రూపాయలు కేటాయిస్తున్నా..ఒక్కటి, రెండు పార్కులు తప్ప మిగితా వాటిలో ఆహ్లాదం మాట దేవుడెరుగు పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో దర్శనమిస్తున్నాయి.

◆ మియాపూర్ డివిజన్ పరిధిలోని న్యూ ప్రశాంత్ నగర్ కాలనీ పార్క్‌లో పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో కళావిహీనంగా దర్శనమిస్తోంది. గతంలో పార్కు ఆక్రమణను తొలగించి చుట్టు ప్రహరీ నిర్మించి అభివృద్ధి చేశారు. కొత్తలో పార్కునిండా మొక్కలు నాటడంతో పచ్చదనంతో కళకళలాడింది. అయితే రాను రాను పార్కు నిర్వహణ గాలికి వదిలేశారు. పార్కులోని బోర్‌వెల్ సైతం మర మ్మతులకు నోచుకోకపోవడంతో నీటి కొరత ఏర్పడింది.

◆ పార్కులోని పిల్లల ఆట వస్తువులు తుప్పుపట్టి విరిగిపోయాయి. వాటిపైనే పిల్లలు ఆడుకుంటూ ప్రమాదాల బారిన పడుతున్నారు. మరోవైపు కుర్చీలు సైతం ధ్వంసమయ్యాయి.

◆ పార్కు అంతా పిచ్చి మొక్కలతో నిండిపోయింది. వాకింగ్ ట్రాక్ పక్కన పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. మరోవైపు ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం, ఎండిన ఆకుల కుప్పలే దర్శనమిస్తున్నాయి.

◆ పార్కునిండా పిచ్చిమొక్కలతో క్రిమీకీటకాలు, పాములు, తేళ్లు సంచరిస్తున్నాయని, పార్కుకు వెళ్లాలంటేనే భయంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

◆ ప్రస్తుతం ఉన్న పాఠశాలలు అపార్ట్‌మెంట్లలోనే కొనసాగుతున్నాయి. ఏ ఒక్క స్కూల్లో కూడా పిల్లలు ఆడుకునేందుకు క్రీడా ప్రాంగణాలు లేవు. ప్రతిరోజు పిల్లలు సాయంత్రం వేళలో ఆడుకునేందుకు పార్కులో కూడా అడుగుపెట్టలేని స్థితిలో ఉన్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

శంకుస్థాపన చేసి..వదిలేశారు

◆ పార్కులో పిల్లల ఆట వస్తువులు, జిమ్ పరికరాలు, పలు అభివృద్ధి పనుల కోసం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ కలిసి 2 నెలల క్రితం శంకుస్థాపన చేశారు. అయినా ఎక్కడిపనులు అక్కడే నిలిచిపోయాయి. నిధులు కేటాయించి శంకుస్థాపన చేసిన కూడా అధికారుల నిర్లక్ష్యం కారణంగా పనులు చేపట్టడం లేదంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పార్కు నిర్వహణతో పాటు అభివృద్ధి పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


పార్క్ ముఖద్వారం

దశలవారీగా చెరువుల సుందరీకరణ


మొక్కలు నాటిన ఎమ్మెల్యే గాంధీ, ఇన్ఫోసిస్ ప్రతినిధులు, సహా ఎన్‌జీఓ కల్పనారమేశ్

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని 64 చెరువులను దశలవారీగా సుందరీకరిస్తున్నామని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీపేర్కొన్నారు. శేరిలింగంపల్లి డివిజన్ మసీద్‌బండలోని కుడికుంట చెరువుల సహా ఎన్‌జీఓ కల్పన రమేశ్‌తో కలిసి, ఇన్ఫోసిస్ సంస్థ సౌజన్యంతో చేపట్టే సుందరీకరణలో భాగంగా శనివారం చెరువు కట్టపై మొక్కలు నాటే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరువుల సుందరీకరణతో జీవవైవిధ్యం పెరగడమే కాకుండా పక్షుల వలసలు మొదలవుతాయని పేర్కొన్నారు. సహా ఎన్‌జీఓ కల్పన రమేశ్ మాట్లాడుతూ..ఇన్ఫోసిస్ సంస్థ కృషితో కుడికుంట చెరువు దశ మారిందన్నారు. అనంతరం కల్పన రమేశ్, ఇన్ఫోసిస్ ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే మొక్కలు నాటారు. కార్యక్రమంలో కాలనీవాసులు, మహిళలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘం సభ్యులు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని తులసినగర్ సంక్షేమ సంఘం సభ్యులు శనివారం కార్పొరేటర్ సబిహా బేగంను వార్డు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఏ, బీ బ్లాక్‌లో మంచి నీటి సరఫరాలో ప్రెషర్ తక్కువగా ఉండటం వల్ల ఇబ్బంది పడుతున్నామని వివరించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. అభివృద్ధి పనులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందన్నారు. ప్రజల భాగస్వామ్యంతో సమస్యల పరిష్కారం దిశగా కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు అంకిత్, విజయ్, దామోదర్ నేత, వెంకట రమణ, శ్రీను, రామారావు, కృష్ణారావు, మోయిత్, శ్రీకాంత్, కిషోర్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

పటాన్‌చెరు టౌన్: విద్యార్థులు కష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటారని ఇంటర్మీడియెట్ జిల్లా అధికారి గోవిందరావు అన్నారు. శనివారం అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని పటేల్‌గూడలో ఐబీటీ చుక్కా రామయ్య ఇష్టా జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలను ఓ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుట్టినప్పుడు ఉయ్యాల్లో వేస్తారు, చనిపోయినప్పుడు నలుగురు మోస్తారు. ఈ మధ్యలో మనం ఏదో చేయాలనే తపన ఏర్పడాలన్నారు. అనంతరం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఇంటర్ దశలోనే మంచి గోల్ పెట్టుకొని కష్టపడితే అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తారని అన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ చదువు మీద దృష్టి పెట్టాలని సూచించారు.

అలరించిన సంగీత కచేరి

మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో అన్నమాస్వరార్చన కార్యక్రమంలో భాగంగా ఎస్ఎల్ సంగీత శిక్షణాలయ గురువు నాగార్జున శిష్య బృందంచే సంకీర్తన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులు శైలజ,రిసాన్, భార్గవి, సుజాత, పావని, శృతి, వనజ, గార్గి తదితరులు మాధవ కేశవ, సతులారా చూడరే, అన్నమయ్య కీర్తనలను ఆలపించి అలరించారు. అనంతరం సంస్థ నిర్వాహకులు కళాకారులను సత్కరించారు.



ఆకట్టుకున్న కూచిపూడి నృత్యాలు





మాదాపూర్: 'ఆచార్య వందనం' కార్యక్రమంలో భాగంగా కందుల కూచిపూడి నాట్యాలయం గురువు రవి కూచిపూడి శిష్యబృందం గురువు ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ యువ పురస్కార్ అవార్డు డాక్టర్ వేదాంతం సత్య నృసింహశాస్త్రిని శనివారం ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథులుగా ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషియన్ ఇన్ఫర్మేషన్ డైరెక్టర్ డాక్టర్ బాలకృష్ణన్ నాయిర్, గురువులు రఘుపాత్రుని శ్రీకాంత్, కొక విజయలక్ష్మి, నల్లమోలు లక్ష్మి, ప్రిన్సిపాల్ శోభారాణి గురువందన సమర్పించారు. రవి కూచిపూడి శిష్యబృందం మూషికవాహన, పుష్పాంజలి, మహాగణపతి, జతిస్వరం తదితర అంశాలను కళాకారులు లాస్య, కమల, స్తుతి, నాగసాహితి, మధువైష్ణవి, జాహ్నవి, వర్ష, మణిమాల, నిదున, వాసవి, చార్వి తదితరులు పాల్గొని ప్రదర్శించారు.

సమస్య పరిష్కారానికి కృషి

పటాన్‌చెరు టౌన్: డివిజన్‌లో నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని చైతన్యనగర్ శివారులో జరుగుతున్న డ్రైనేజీ పనులను పరిశీలించారు. అనంతరం కాలనీవాసులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట స్థానికులు ఉన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలి

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ పరిధిలోని దత్తాత్రేయ కాలనీ సాయిబాబా ఆలయం వద్ద సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డుకు ఇరువైపులా అంచుల వద్ద మట్టి వేయాలని, క్యూరింగ్ చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో శివరాజ్‌గౌడ్, బ్రహ్మానంద గౌడ్, ప్రసాద్, పోశెట్టి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


సీసీ రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్

27 కులాలను బీసీ జాబితాలో చేర్చాలి

మూసాపేట: తెలంగాణ రాష్ట్రంలోని తూర్పు కాపు సామాజిక వర్గంతో పాటు తొలగించిన 27 కులాలను బీసీ జాబితాలో చేర్చాలని టీపీసీసీ లేబర్ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి గోకర్ల లక్ష్మీనారాయణ కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బీసీ జాబితాలోనే ఉండేవని, రాష్ట్రం ఏర్పడిన తరువాత జాబితాలో నుంచి 27 కులాలను తొలగించారన్నారు. శ్రీకాకుళం నుంచి అత్యధికంగా వలస వచ్చిన ప్రజలు గ్రేటర్ హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారని, వారు ఆర్థికంగా వెనుకబడి విద్యా, ఉపాధి రిజర్వేషన్లు, ప్రభుత్వం అందించే పథకాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అయినా వారిని బీసీ జాబితాలో చేర్చి వారికి న్యాయం చేయాలని కోరారు.

హోర్డింగ్..యమ డేంజర్

- ఇళ్లపై ప్రమాదకరంగా హోర్డింగ్‌ల ఏర్పాటు
- ఫ్లెక్సీలు చినిగి విద్యుత్‌తీగలపై పడుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు


భవనంపై పడిపోయిన హోర్డింగ్ ఫ్రేమ్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): హైదరాబాద్ మహానగరానికి శివారు ప్రాంతమైన తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో అనేక ప్రముఖ సంస్థల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. దీంతో ఈప్రాంతం వాణిజ్య ప్రకటనలకు నిలయంగా మారింది. దానిని దృష్టిలో పెట్టుకుని ఆదాయ వనరుల కోసం పెద్ద ఎత్తున హోర్డింగ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఆ హోర్డింగ్‌లే నేడు అనేక ప్రాంతాలలో ప్రమాదకరంగా మారాయి. గతంలో పని చేసిన పలువురు అధికారులు ఈహోర్డింగ్‌లకు ఇష్టానుసారంగా అనుమతులిచ్చారని స్థానికులు ఆరోపిస్తున్నారు. చిన్నపాటి నిర్మాణాలపై సైతం ఎలాంటి అనుమతులు లేకుండా హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తున్న అధికారులు పట్టించుకోకపోవడం విశేషం.

ఇష్టానుసారంగా ఏర్పాట్లు..

అధికారుల అండతో రేడియల్ రోడ్లను ఆనుకుని, చిన్నపాటి నిర్మాణాలపై పెద్ద ఎత్తున హోర్డింగ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. గతంలో అధికారులు తమ లాభాల కోసం వీటి ప్రోత్సహించారని స్థానికులు వాపోతున్నారు. రేడియల్ రోడ్డును అనుకొని అనేక హోర్డింగ్‌లు నిత్యం ప్రమాదకరంగా మారుతున్నాయి. ఈదురుగాలులు వచ్చిన సమయంలో హోర్డింగ్‌లపై ఏర్పాటు చేసే ఫ్లెక్సీలు చినిగిపోయి వాహనదారులపై, విద్యుత్‌తీగలపై ప్రమాదకరంగా పడుతున్నాయి. దాంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. విద్యుత్ తీగలపై పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంతోపాటు వాటిని తొలగించడానికి విద్యుత్ శాఖ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గాలులకు అనేక ప్రాంతాలలో హోర్డింగ్‌లు కిందపడిపోయిన ఘటనలు అనేకం ఉన్నాయి. గత కొద్ది రోజుల క్రితం మున్సిపల్ కార్యాలయం సమీపంలోని ఓ ఇంటిపై ఏర్పాటుచేసిన హోర్డింగ్ పడిపోయింది.


11కేవీ విద్యుత్ తీగలపై పడిన హోర్డింగ్‌పై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

అధికారుల లెక్కల ప్రకారం..

తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో అధికారుల లెక్కల ప్రకారం 80 హోర్డింగ్‌లు మాత్రమే ఉన్నాయి. ఇంకా మున్సిపాలిటీలో విలీనమైన 5గ్రామాలలో ఎన్ని హోర్డింగ్‌లున్నాయో అధికారుల వద్ద లెక్క లేకపోవడం విశేషం.

వర్షాకాలంలో తప్పని ఇబ్బందులు..

వర్షాకాలంలో హోర్డింగ్‌లతో స్థానిక ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. ఈదురు గాలుల కారణంగా హోర్డింగ్‌లపై ఏర్పాటు చేసే ఫ్లెక్సీలు 11కేవీ విద్యుత్‌తీగలపై పడుతున్నాయి. దీంతో గతంలో విద్యుత్ శాఖ అధికారులు పలువురుకి నోటీస్‌లు ఇవ్వడం జరిగింది.

సర్వే చేసి చర్యలు తీసుకుంటాం



హోర్డింగ్‌లపై సర్వే నిర్వహిస్తాం. అనుమతులు లేని వాటిని గుర్తించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం.

– అజయ్ కుమార్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్, తెల్లాపూర్

పార్కుల అభివృద్ధి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని కాకతీయనగర్ కాలనీలో శనివారం కార్పొరేటర్ పుష్ప పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. పార్కును అభివృద్ధి చేయాలని కోరారు. పలుచోట్ల డ్రైనేజీ సమస్య ఉందని వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కాలనీలోని సొసైటీ ఆవరణలో పార్కును అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. త్వరలో సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు.

దాడి కేసులో ఒకరి అరెస్ట్

గచ్చిబౌలి: దాడి కేసులో రాయదుర్గం పోలీసులు ఒకరిని అరెస్ట్ చేశారు. ఈనెల 8న అర్ధరాత్రి నాలెడ్జ్ సిటీలో ఇషా హోటల్ వద్ద ఉన్న యూ టర్న్ విషయంలో సోమాలియాకు చెందిన అహ్మద్ (25) కు పలువురి మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో అహ్మద్‌ను కడుపులో కత్తితో పొడిచి నిందితుడు పరారైన విషయం తెలిసిందే. 2 బైక్‌లపై వచ్చిన నలుగురు యువకుల కోసం రాయదుర్గం పోలీసులు గాలింపు చేపట్టారు. బాలానగర్‌కు చెందిన అనీష్ (26)ను శనివారం అరెస్ట్ చేశారు. కత్తితో దాడి చేసిన యువకుడితో పాటు మరో ఇద్దరు యువకుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. గాయపడిన అహ్మద్ మెడికోవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

- పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ
- భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ల పనులకు శంకుస్థాపన


యూజీడీ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ, కార్పొరేటర్లు

చందానగర్ : మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. చందానగర్, హఫీజ్‌పేట్, మియాపూర్ డివిజన్ల పరిధిలో సుమారు.2.15 కోట్లు ఎమ్మెల్యే, ఎస్‌డీఎఫ్, జలమండలి నిధులతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ పనులకు స్థానిక కార్పొరేటర్లతో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చందానగర్ డివిజన్ పరిధిలోని వేముకుంట, ఇందిరానగర్, సురక్ష ఎన్‌క్లేవ్, శంకర్‌నగర్, హుడా ఫేజ్ 2, పీఏనగర్ కాలనీల్లో రూ.1.05 కోట్లు, హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని నందినినగర్, సాయినగర్ కాలనీల్లో రూ.60.50 లక్షలు, మియాపూర్ డివిజన్ పరిధిలోని నాగార్జున ఎన్‌క్లేవ్‌లో రూ.50 లక్షలతో భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ పనులు చేపట్టామన్నారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో శేరిలింగంపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు డీజీఎం నారాయణ, మేనేజర్లు సునీత, శిరీష, నాయకులు, కార్యకర్తలు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు, మహిళలు పాల్గొన్నారు.